నేరానికి శిక్ష తప్పదు

టీడీపీ అధినేత చంద్రబాబు అరెస్ట్‌పై నియోజకవర్గ ప్రజల స్పందన

తగరపువలస: స్కిల్ డెవలప్‌మెంట్ స్కాంలో సీఐడీ అధికారులు శనివారం టీడీపీ అధినేత, మాజీ సీఎం చంద్రబాబు నాయుడును అదుపులోకి తీసుకున్న సంఘటనను సంబంధించి భీమిలి నియోజకవర్గ ప్రజలు సమర్థిస్తున్నారు. తప్పు చేసిన వారు ఎంత హోదాలో ఉన్నా సరే.. శిక్ష నుంచి తప్పించుకోలేరని అంటున్నారు. ప్రజల సొమ్మును కొల్లగొట్టేవారు, ప్రభుత్వ ఖజానాకు నష్టం కలిగించే వారికి ఇది గుణపాఠం కావాలంటున్నారు. ప్రజలకు సేవకులుగా ఉండవలసిన వారు వారి సొమ్మునే దుర్వినియోగం చేస్తే చట్టాలు తమ పని తాము చేసుకుంటూ పోతాయంటున్నారు. చంద్రబాబు అరెస్ట్‌ను రాజకీయం చేయవద్దని ప్రజలు కోరుతున్నారు. వీరిలో టీడీపీ సానుభూతి పరులు మాట్లాడుతూ అడ్డంగా దొరికి అరెస్ట్ అయ్యాడంటూ వ్యాఖ్యలు చేస్తున్నారు. చంద్రబాబును కాపాడాలని చూసేవారు కూడా ప్రజలకు ద్రోహం చేసేవారు అవుతారని చెబుతున్నారు.

నియోజకవర్గంలో టీడీపీ మిత్రపక్షాల నాయకులు కూడా మాట్లాడుతూ ఎంతటి వారికైనా పాపం పండిన తరువాత శిక్ష పడాల్సిందేనని అంటున్నారు. సీఐడీ అధికారులు చంద్రబాబును అదుపులోకి తీసుకున్నా భీమిలి ప్రజలు పెద్దగా స్పందించలేదు. ముఖ్యంగా టీడీపీ నుంచి కూడా ఎలాంటి ప్రతిస్పందన రాకపోవడంతో పలువురు ఆశ్చర్యం వ్యక్తం చేశారు. అడ్డంగా దొరికి అరెస్ట్ అయ్యాడు మా చంద్రబాబు అంటూ పలువురు నాయకులు జోకులు వేసుకుంటూ కనిపించారు. ఒకప్పటి టీడీపీ కంచుకోటగా పేరొందిన భీమిలి నియోజకవర్గంలో చాలా వరకు నాయకులు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలనకు ముగ్ధులై వైఎస్సార్‌సీపీలో చేరిపోయారు.

దీంతో ప్రధాన ప్రతిపక్షమైన టీడీపీలో మిగిలిన కార్యకర్తలు బేలచూపులు చూస్తున్నారు. నియోజకవర్గంలో అసమ్మతి కారణంగా ముఖ్యమైన నాయకులంటూ ఎవరూ లేకపోవడంతో చివరికి వార్డు, పంచాయతీలు కూడా గెలవలేని టీడీపీ శ్రేణులను భీమిలి పోలీసులు ముందస్తుగా అదుపులోకి తీసుకుని వదిలేశారు.

రాజకీయ ప్రక్షాళన జరగాలి



సంపాదన కోసం, ఆస్తులు కూడబెట్టుకోవడానికే రాజకీయాల్లోకి వచ్చే వారికి చంద్రబాబు అనుభవం చెంపపెట్టు కావాలి. ప్రజలు ఎన్నో ఆశలతో తమ విలువైన ఓటు ద్వారా నేతలను ఎన్నుకుంటే వారు ప్రజల ఆశలకు గండికొట్టి స్వప్రయోజనాల కోసం పని చేసేవారికి శిక్ష పడాలి. ఆ విధంగా రాజకీయాలు ప్రక్షాళన కావాలి. – **చిల్ల సూర్యనారాయణరెడ్డి**, వలందపేట

ఇతరులకు గుణపాఠం కావాలి



ఉన్నత పదవుల్లో ఉన్న వారు ఎన్ని తప్పులు చేసినా.. కప్పిపోతాయనుకోవడం పొరపాటు. చరిత్ర చూస్తే ఎందరో జాతీయ, అంతర్జాతీయ నాయకులు కూడా తమ తప్పిదాలకు మూల్యం చెల్లించుకున్నారు. చంద్రబాబు అరెస్ట్ ఇతరులకు గుణపాఠం కావాలి.

– **ఒమ్మి దేవుడు**, భీమందొరపాలెం, ఆనందపురం

అవినీతిపరులను ప్రోత్సహించవద్దు



ప్రతిపక్ష నేత చంద్రబాబు అవినీతిపై చట్టం తన పని తాను చేసుకుపోతుంటే టీడీపీ నాయకులు అడుగడుగునా అడ్డు తగలడమేంటి? దీనికి, రాజకీయాలకు సంబంధం ఏంటి? పవన్, పురందేశ్వరి, బాలకృష్ణ, వామపక్షాల నాయకులు చంద్రబాబును వెనకేసుకుని వస్తే వారు కూడా అవినీతిని ప్రోత్సహిస్తున్నట్టే. వారి మైండ్‌సెట్ మారాలి.

– **చేట్ల శ్రీనివాసరెడ్డి**,ఆటో కార్మికుడు, తగరపువలస

చట్టానికి చంద్రబాబు అతీతుడు కాదు



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ 2వ వార్డు నాయకులు

తగరపువలస: వందల కోట్ల రూపాయలు స్కిల్ డెవలప్‌మెంట్ నిధులను దోచుకున్న టీడీపీ అధినేత చంద్రబాబు చట్టానికేమి అతీతుడు కాదని వైఎస్సార్‌సీపీ రెండో వార్డు నాయకులు అన్నారు. జీరుపేటలోని పార్టీ కార్యాలయంలో శనివారం వారు మాట్లాడుతూ రాష్ట్ర ఖజానాకు గండికొట్టిన చంద్రబాబుకు సీఐడీ అధికారులు అన్ని ఆధారాలతో నోటీసులు ఇచ్చి అదుపులోకి తీసుకున్నారన్నారు. చట్టం తన పని తాను చేసుకుపోతుంటే రాష్ట్రంలో కొన్ని చోట్ల టీడీపీ నాయకులు నిరసన కార్యక్రమాలకు దిగడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ఈ విషయంలో ప్రభుత్వానికి ఎటువంటి సంబంధం లేకపోయినా జనసేన అధ్యక్షుడు పవన్, పురందేశ్వరి, బాలకృష్ణ వంటి వారు గుండెలు బాదుకోవడం విచిత్రంగా ఉందన్నారు. వ్యవస్థలను గుప్పిట్లో పెట్టుకుని స్టేలు తెచ్చుకోవడంలో ఘనుడైన చంద్రబాబు తన సచ్ఛీలతను నిరూపించుకోవాలన్నారు. అవినీతిని అంతం చేయాలనుకుంటున్న అధికారులకు మద్దతు పలకాల్సిన బాధ్యత ప్రతి పౌరుడిపై ఉందన్నారు. 40 ఏళ్ల రాజకీయ అనుభవం, 14 ఏళ్ల ముఖ్యమంత్రిగా పనిచేసిన అపార అనుభవం కలిగిన చంద్రబాబు తాను పప్పు కాదు.. నిప్పు అని నిరూపించుకోవాలని సవాల్ విసిరారు. జీరు వెంకటరెడ్డి, చిల్ల బాబయ్యరెడ్డి, చిల్ల గణేష్‌రెడ్డి, జీరు భరత్‌రెడ్డి, చిల్ల త్రినాథ్‌రెడ్డి పాల్గొన్నారు.

ఇప్పటికే ఆలస్యమైంది..



రాష్ట్రంలో ఇప్పటి వరకు చంద్రబాబు చేసినన్ని అవినీతి పనులు ఎవరూ చేసి ఉండరు. అన్నింటిలోనూ తన టాలెంట్ ఉపయోగించి వ్యవస్థలను మేనేజ్ చేసుకుంటూ తప్పించుకుంటూ వస్తున్నారు. ఇప్పటికైనా ఆయన అరెస్ట్‌తో న్యాయం ఇంకా బతికే ఉందని రుజువైంది.

– **కె.ఎ.ఎస్.ఎన్.రెడ్డి**, రిటైర్డ్ వీఆర్వో, మూలకుద్దు

చంద్రబాబు అరెస్టు సరైందే..



అవినీతికి పాల్పడి చట్టం నుంచి తప్పించుకుంటున్నామని విర్రవీగే వారికి టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు అరెస్ట్ గుణపాఠం కావాలి. అవినీతికి పాల్పడిన వారిని చట్టం శిక్షిస్తుంటే.. వారికి అడ్డంకులు కలిగించేవారు కూడా నేరం చేసినట్టే. చట్టం తన పని తాను చేసుకుపోతుంది. ఇది రాష్ట్రానికి శుభ దినం.

– **బొడ్డు నరసింగరావు**, గణేష్ దళిత సేవా సంఘం కార్యదర్శి, తగరపువలస

సచ్ఛీలుడైతే నిరూపించుకోవాలి



చంద్రబాబు ఎటువంటి తప్పు చేయకపోతే భయపడాల్సిన అవసరం లేదు. చట్టానికి సహకరించి తన సచ్ఛీలతను నిరూపించుకోవాలి. స్టేల పేరుతో న్యాయదేవత కళ్లకు ఎంతకాలం గంతలు కడతారు. ఎన్ని కేసుల నుంచి తప్పించుకుంటారు.

– **వెంపాడ అప్పలకారురెడ్డి**, గ్రామీణ వైద్యుడు, చిప్పాడ

చట్టం ముందు అందరూ సమానులే



చంద్రబాబు నేరం చేసినట్టు పక్కా ఆధారాలు ఉండబట్టే ఆయనను అరెస్ట్ చేశారు. మన ప్రజాస్వామ్య దేశంలో ఎంతటివారు తప్పు చేసినా చట్టం ముందు ఒక్కటే. గతంలో సీఎంగా ఉన్న జయలలిత, లాలు ప్రసాద్ యాదవ్ తదితరులు జైలుకు వెళ్లిన వారే. వారికన్నా చంద్రబాబు గొప్పకాదు. నిజంగా ఆయన తప్పుచేయకపోతే నిరూపించుకోవాలి. – **సంకురుభుక్త రమేష్**, భీమిలి

క్లుప్తంగా

శ్రీవారి ఆలయానికి పోటెత్తిన భక్తులు



అన్నదానం చేస్తున్న శ్రీవారి భక్తులు

కొమ్మాది: రుషికొండలోని శ్రీమహాలక్ష్మి గోదాదేవి సహిత శ్రీ వేంకటేశ్వర స్వామివారి ఆలయానికి శనివారం భక్తులు పోటెత్తారు. వేకువజామున సుప్రభాత సేవ అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు. మధ్యాహ్నం మహా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రతి నెలా రెండో శనివారం శ్రీవారి లడ్డు ప్రసాద విక్రయాలు కొనసాగించారు. ఏర్పాట్లను ఆలయ ఏఈవో జగన్మోహనాచార్యులు పర్యవేక్షించారు.

నేడు వివేకానంద రీడింగ్ రూం ప్రారంభం

భీమునిపట్నం: భీమిలిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల రోడ్డులో ఆదివారం ఉదయం 10 గంటలకు యువ భారత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వివేకానంద రీడింగ్ రూంను ప్రారంభిస్తున్నట్టు నిర్వాహకుడు సంకురుభుక్త జోగారావు తెలిపారు. ప్రతి రోజు సాయంత్రం 4.30 నుంచి 7.30 గంటల వరకు ఇది అందుబాటులో ఉంటుందని చెప్పారు. 5వ తరగతి నుంచి పదో తరగతి విద్యార్థులకు అవసరమైన పుస్తకాలు రీడింగ్ రూంలో ఉంచామన్నారు. విద్యార్థులకు ప్రవేశం పూర్తి ఉచితమని, దీన్ని వినియోగించుకోవాలని ఆయన కోరారు.

శిల్పారామంలో నృత్య ప్రదర్శన నేడు

పీఎం పాలెం: వారాంతపు వినోద కార్యక్రమాల్లో భాగంగా శిల్పారామం (జాతర)లో ఆదివారం సాయంత్రం 6 గంటలకు శాస్త్రీయ నృత్య ప్రదర్శన నిర్వహించనున్నామని స్థానిక ఏవో టి.విశ్వనాథ రెడ్డి తెలిపారు. నగరానికి చెందిన వారాహి కూచిపూడి నృత్య అకాడమీ ఆధ్వర్యంలో ప్రదర్శన ఉంటుందని ఆయన పేర్కొన్నారు.

వైఎస్సార్ బీమా తక్షణ సాయం అందజేత



ఆర్థిక సాయం అందజేస్తున్న అధికారులు

ఆనందపురం: మండలంలోని గంభీరం పంచాయతీ కల్లివానిపాలెం ఇందిరమ్మ కాలనీలో ఇటీవల ఓ వ్యక్తి మృతి చెందాడు. బాధిత కుటుంబానికి శనివారం తక్షణ ఆర్థిక సాయాన్ని అధికారులు అందజేశారు. పి.రమణమ్మ అనే మహిళ ఇంటి వద్ద మృతి చెందగా వైఎస్సార్ బీమా పథకంలో భాగంగా రూ.10,000ను వెల్ఫేర్ అసిస్టెంట్ దివ్య కుటుంబ సభ్యులకు అందించారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు బొట్టా రామకృష్ణ, ఉప్పాడ సూరిబాబు, వలంటీర్ రమేష్ పాల్గొన్నారు.

ఆనంద్‌మార్గ్ ఆశ్రమానికి వాటర్ ఫిల్టర్ వితరణ



ఆనంద్‌మార్గ్ ఆశ్రమానికి వాటర్ ఫిల్టర్ అందజేస్తున్న పారామౌంట్ సంస్థ సభ్యులు

ఆరిలోవ : ఇందిరానగర్‌లో ఉన్న ఆనంద్‌మార్గ్ ఆశ్రమం అనాథ పిల్లలకి వైజాగ్ పారామౌంట్ సంస్థ సహకారం అందించింది. శనివారం సంస్థ సభ్యులు వాటర్ ప్యూర్‌ఫైని ఇక్కడి స్వామీజీ సౌమ్యానంద్ అవధూతకు అందించారు. ఈ సందర్భంగా స్వామీజీ సంస్థ ప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు.

ప్రజారోగ్యమే ప్రభుత్వ లక్ష్యం

- ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు
- శొంఠ్యాంలో ఆరోగ్య కేంద్ర నిర్మాణానికి శంకుస్థాపన



శొంఠ్యాంలో శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

ఆనందపురం: ప్రతి మారుమూల గ్రామ ప్రజలకు వైద్య సేవలు అందించాలన్న లక్ష్యంతో వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వం పనిచేస్తోందని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని శొంఠ్యాంలో నాడు–నేడు నిధులు రూ.2.40 కోట్లతో నిర్మించనున్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి శనివారం ఆయన శంకుస్థాపన చేసి మాట్లాడారు. గతంలో వైద్య సేవలు మండల కేంద్రానికే పరిమితమయ్యేయని, దీనివల్ల మారుమూలన ఉన్న ప్రజలకు వైద్యం అందక చాలా మంది ప్రాణాలు కోల్పోయేవారన్నారు. ఈ దుస్థితి నుంచి ప్రజలను కాపాడటానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ నాడు–నేడు కింద నిధులు విడుదల చేసి ప్రతి సచివాలయంలోనూ వెల్‌నెస్ సెంటర్లు నిర్మించి వైద్య సిబ్బందిని నియమించారని చెప్పారు. దీంతో నేడు అందరికీ స్థానికంగానే అత్యవసర వైద్య సేవలు అందుతున్నాయన్నారు. ముఖ్యంగా ఫ్యామిలీ డాక్టర్ వైద్య విధానం వల్ల మంచానికే పరిమితమైన రోగులకు ఇంటి వద్దే వైద్యం అందించడంతో చాలా మంది పేదలకు ఎంతో ఉపయోగకరంగా మారిందన్నారు.

మండలంలో సుమారు 60 వేల జనాభా ఉండగా.. ఒకే ఒక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఉండటం వల్ల 26 పంచాయతీల ప్రజలకు వైద్య సేవలు అందని పరిస్థితి ఉందన్నారు. దీంతో శొంఠ్యాంలో మరో ఆరోగ్య కేంద్రం ఏర్పాటుకు సీఎం జగన్‌ను కోరిన వెంటనే అంగీకరించి నిధులు విడుదల చేశారన్నారు. దీని వల్ల 12 పంచాయతీల ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందుబాటులోకి వస్తాయని వివరించారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా వైఎస్ జగన్ రాష్ట్ర వ్యాప్తంగా ఒకే సారి 33 సంక్షేమ పథకాలను అమలు జరిపితే అది రుచించని టీడీపీ అధినేత చంద్రబాబు ఇలా అయితే రాష్ట్రం దివాళా తీయడం ఖాయమని విమర్శించారన్నారు. వైఎస్ జగన్ పాలనలో శొంఠ్యాం పంచాయతీలో సుమారు వంద కోట్లతో సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేశామని గుర్తు చేశారు. ప్రజలకు ఇలాంటి మేలు జరగాలంటే మళ్లే జగన్‌నే ముఖ్యమంత్రిని చేసుకోవలసిన బాధ్యత అందరిపైన ఉందన్నారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ జగదీశ్వరరావు, లెంకరాంబాబు, ఎంపీటీసీ సభ్యురాలు పల్లా దుర్గ, వైఎస్ ఎంపీపీ పాండ్రింకి శ్రీను, పార్టీ మండలాధ్యక్షుడు బంక సత్యం, మజ్జి వెంకటరావు, కాకర్లపూడి శ్రీకాంత్ రాజు, గండ్రెడ్డి శ్రీను, బొట్టా రామకృష్ణ, డోల దేవుడు, కోరాడ వెంకట రమణారావు, గొలగాని కృష్ణ, గొంతిన స్వామినాయుడు, షిణగం అప్పలరాజు, పడాల రాము తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ నాయకుల ముందస్తు అరెస్ట్

పద్మనాభం: ప్రతిపక్ష నేత చంద్రబాబును సీఐడీ అధికారులు అరెస్టు చేసిన నేపథ్యంలో ముందస్తుగా పద్మనాభానికి చెందిన ముగ్గురు టీడీపీ నాయకులను పోలీసులు అరెస్టు చేశారు. మాజీ జెడ్పీటీసీ సభ్యుడు కశిరెడ్డి దామోదరరావు, టీడీపీ మండల శాఖ అధ్యక్షుడు కోరాడ రమణ, కంటుబోతు సుమంత్ నాయుడులను అరెస్టు చేయడంతో టీడీపీ కార్యకర్తలు పద్మనాభం పోలీస్ స్టేషన్ ఎదుట ఆందోళన చేశారు.

సర్వీస్ రోడ్డుపై మొరాయించిన వాహనం



అనిట్స్ కళాశాల బస్టాప్ సర్వీస్ రోడ్డుపై నిలిచిన భారీ వాహనం

తగరపువలస: సర్వీస్‌రోడ్డుపై తరచూ భారీ వాహనాలు మొరాయిస్తుండడంతో తరచూ ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతోంది. జాతీయ రహదారి పైనుంచి రాకపోకలు సాగించాల్సిన భారీ వాహనాలు వివిధ కారణాలతో సర్వీస్ రోడ్డులోకి వస్తున్నాయి. ఆ సమయంలో కూడళ్ల వద్ద ట్రాఫిక్ ఎక్కువగా ఉండటంతో భారీ వాహనాలు ముందుకు సాగలేకపోతున్నాయి. దీంతో మరింత ట్రాఫిక్ నిలిచిపోయి వాహనదారుల సహనానికి పరీక్ష పెట్టినట్టవుతుంది. శనివారం సాయంత్రం ఇదే కారణంగా సంగివలస ముగ్గురు అమ్మవార్ల ఆలయం ఎదురుగా అనిట్స్ కూడలిలో ట్రాఫిక్ స్తంభించిపోయింది. దీంతో మిగిలిన వాహనదారులు ఇబ్బంది పడ్డారు. వేంకటేశ్వర మెట్ట నుంచి తాళ్లవలస వరకు సర్వీస్‌రోడ్డులోకి భారీ వాహనాల రాకపోకలు, పార్కింగ్ చేయకుండా చూడాలని తగరపువలస ప్రజలు కోరుతున్నారు.

గణపతి నవరాత్రి ఉత్సవాలకు ముహూర్తపు రాట



పాత పీఎంపాలెంలో రాట వేస్తున్న లక్ష్మీపరమేశ్వరి తదితరులు

మధురవాడ: గణపతి నవరాత్రి ఉత్సవాలకు మధురవాడలోని పలు గ్రామాలు, కాలనీలు సిద్ధమవుతున్నాయి. ఇందులో బాగంగా 7వ వార్డు పాత పీఎం పాలెంలో శనివారం ఉత్సవ రాట వేశారు. పోతిన వారి యువజన సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉత్సవాలకు వైఎస్సార్‌సీపీ మహిళా నాయకురాలు పోతిన లక్ష్మీపరమేశ్వరి, 7వ వార్డు అధ్యక్షుడు పోతిన శ్రీనివాసరావు ఇతర దంపతులు, ముత్తయిదువులు పూజలు చేసి సంప్రదాయ బద్ధంగా కార్యక్రమం నిర్వహించారు. ఉత్సవాల నిర్వహణకు అన్ని రకాల సహాయ సహకారాలు అందిస్తామని శ్రీనివాసరావు చెప్పారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు పోతిన గోవిందు, నీలియ పోతిన వారి యువత, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

ప్రసన్న ఆంజనేయునికి పూజలు



ప్రత్యేక అలంకరణలో ఆంజనేయ స్వామి

పీఎం పాలెం: స్థానిక ఆఖరు బస్టాపు నుంచి బక్కన్నపాలెం వెళ్లే రోడ్డులో శ్రీ శృంగేరీ శంకర మఠం క్షేత్ర పాలకుడు ప్రసన్నాంజనేయ స్వామికి శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనతరం స్వామిని ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు.

లోక్ అదాలత్‌లో 1,201 కేసుల పరిష్కారం



లోక్ అదాలత్ నిర్వహిస్తున్న జూనియర్ సివిల్ జడ్జి కోర్టు మేజిస్ట్రేట్ విజయలక్ష్మి

భీమునిపట్నం: భీమిలో శనివారం నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో మొత్తం 1,201 కేసులు పరిష్కారమయ్యాయి. ఇక్కడి ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టు మేజిస్ట్రేట్ పి.నాగేశ్వరరావు, మొదటి అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టు మేజిస్ట్రేట్ జి.విజయలక్ష్మి, రెండో అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టు మేజిస్ట్రేట్ సీహెచ్.చిరంజీవి ఆధ్వర్యంలో లోక్ అదాలత్ నిర్వహించారు. భీమిలి, ఆనందపురం, పద్మనాభం, పీఎం పాలెం పోలీస్ స్టేషన్లకు సంబంధించిన కేసులు పరిష్కరించారు.

ప్రభుత్వ ఆస్పత్రిలోనే కాన్పులు జరగాలి

డీఎంహెచ్‌వో జగదీశ్వరరావు



ఆరోగ్య కేంద్రంలో బిడ్డను పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో జగదీశ్వరరావు

ఆనందపురం: ప్రభుత్వ ఆస్పత్రిలోనే కాన్పులు జరిగేటట్టు సిబ్బంది చర్యలు తీసుకోవాలని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి(డీఎంహెచ్‌వో) డాక్టర్ జగదీశ్వర రావు ఆదేశించారు. శనివారం ఆయన ఆనందపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించారు. అక్కడ తల్లి, బిడ్డలను పరిశీలించి అందుతున్న వైద్య సేవలు గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో మాట్లాడుతూ ప్రభుత్వం అన్ని సౌకర్యాలు కల్పించిన దృష్ట్యా ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నెలకు కనీసం ఐదుకు పైగా ప్రసవాలు జరిగేటట్టు సిబ్బంది చూడాలన్నారు. వాటి వివరాలను ఆరోగ్యశ్రీ పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలని సూచించారు. గర్భిణులకు ముందస్తుగానే ప్రసవ వివరాలను తెలియజేసి వారికి అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారులు గంగునాయుడు, షేక్ షహనాజ్ సాదియా, సామాజిక ఆరోగ్యాధికారి పి.సాంబమూర్తి, పీహెచ్ఎన్ కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

హెచ్చరిక బోర్డు ఏర్పాటు



పరదేశిపాలెంలో హైవేను ఆనుకుని ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డు

మధురవాడ: విశాఖ రూరల్ మండలం పరదేశిపాలెం రెవెన్యూ గ్రామంలో ప్రభుత్వ భూమి పరిరక్షణకు రెవెన్యూ అధికారులు చర్యలు చేపట్టారు. ఇటీవల ఇక్కడ జాతీయ రహదారిని ఆనుకుని ప్రభుత్వ స్థలంలో ఓ వ్యక్తి రోడ్డు ఏర్పాటు చేయడానికి చేస్తున్న ప్రయత్నాలను రెవెన్యూ అధికారులు అడ్డుకున్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సిబ్బంది హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేసి ప్రభుత్వ భూమికి రక్షణ కల్పించారు. హైవేను ఆనుకుని ఉన్న అత్యంత విలువైన సుమారు వంద గజాలు మేర ప్రభుత్వ స్థలాన్ని రక్షించారు.

శిక్షణ తరగతులు ప్రారంభం



శిక్షణ ప్రారంభిస్తున్న ప్రధానోపాధ్యాయుడు మురళీమోహన్‌రావు

తగరపువలస: చిట్టివలస జెడ్పీ హైస్కూల్‌లో శనివారం నేషనల్ మీన్స్ మెరిట్ స్కాలర్‌షిప్ పరీక్షకు ఉచిత శిక్షణ ప్రారంభమైంది. ఫ్రెండ్స్ ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో అందిస్తున్న శిక్షణకు మొదటిరోజు 50 మంది విద్యార్థులు హాజరయ్యారు. పాఠశాలలకు సెలవు రోజుల్లో ఈ శిక్షణ తరగతులు నిర్వహించనున్నారు. కార్యక్రమంలో సొసైటీ వ్యవస్థాపకుడు గంటాన మోహన్‌రావు, ప్రధానోపాధ్యాయుడు పాట్నూరు మురళీమోహన్‌రావు, స్కూల్ అసిస్టెంట్లు రేఖ అప్పారావు, పక్కి నాగేశ్వరరావు, యాగాటి వెంకటరమణ, ఎల్‌ఏ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

వినోద్ బాలుకు 'సురా' పురస్కారం



పురస్కారం అందుకుంటున్న వినోద్ బాలు

సీతంపేట: హేతువాది పేరిచర్ల సుబ్బరాజు(సురా) సామాజిక సేవా పురస్కారం 2023 సంవత్సరానికి సోషల్ వర్కర్ ఉడుముల వినోద్ బాలుకు ప్రదానం చేశారు. సావిత్రిబాయి పూలే ఎడ్యుకేషనల్ అండ్ చారిటబుల్ ట్రస్టు చైర్‌పర్సన్ గూడూరు సీతామహాలక్ష్మి అధ్యక్షతన శనివారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో జరిగిన కార్యక్రమంలో అతిథుల చేతుల మీదుగా పురస్కారం, రూ.25 వేల నగదును ఆయనకు అందించారు. సంస్థ మేనేజింగ్ ట్రస్టీ కె.బాబూరావు, రచయితలు అనిశెట్టి రజిత, కె.ఎన్.మల్లీశ్వరి, రిటైర్డ్ ప్రొఫెసర్ పేటా బాబివర్ధన్, ఎస్.కోటేశ్వరరావు పాల్గొన్నారు.

మద్యం తాగి వాహనాలు నడిపితే భారీ జరిమానాలు



డాబాగార్డెన్స్‌లో తనిఖీలు నిర్వహిస్తున్న టూటౌన్ ట్రాఫిక్ ఎస్‌ఐ

అల్లిపురం : మద్యం తాగి వాహనాలు నడిపితే రూ.10 వేలకు పైగా జరిమానా తప్పదని టూటౌన్ ట్రాఫిక్ ఎస్‌ఐ లక్ష్మి తెలిపారు. శనివారం ఒక్కరోజే టూటౌన్ పరిధిలో 36 మంది నుంచి కోర్టు రూ.4 లక్షల 10 వేలు జరిమానా విధించిందని పేర్కొన్నారు. టూటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో పెన్ స్కూల్, అంబేడ్కర్ జంక్షన్, అల్లిపురం జంక్షన్‌లలో నిర్వహించిన డ్రంక్ అండ్ డ్రైవ్‌లో మద్యం తాగి వాహనం నడుపుతూ పట్టుబడ్డ వారిని శనివారం నగరంలో స్పెషల్ మేజిస్ట్రేట్ కోర్టులో హాజరుపరచగా వారికి ఒక్కొక్కరికి రూ.10 వేల నుంచి రూ.20 వేల వరకు జరిమానా విధించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ లక్ష్మి మాట్లాడుతూ మద్యం తాగి వాహనాలు నడిపితే న్యాయస్థానాల్లో భారీ జరిమానా తప్పదని, అదే విధంగా మైనర్లకు వాహనాలు ఇవ్వొద్దని తల్లిదండ్రులను హెచ్చరించారు.

మద్దిలపాలెం డిపోనకు రూ.5లక్షల నష్టం

డిపోలో 40 బస్సుల నిలిపివేత

మద్దిలపాలెం : స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో చంద్రబాబు అరెస్టు చేయడంతో ఆందోళనకారులు ఎక్కడ బస్సులపై దాడులకు పాల్పడతారోనని ముందస్తుగా చాలా సర్వీసులు నిలిపివేశారు. మద్దిలపాలెం డిపోలో శనివారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకూ బస్సులు ఎక్కడి అక్కడే నిలిచిపోయాయి. సిటీలో సర్వీసు బస్సులు 40వరకూ పూర్తిగా రద్దు చేశారు. కాగా ఇదే డిపో నుంచి సుదీర ప్రాంతాలకు వెళ్లే అన్ని సర్వీసులను పూర్తి నిలిపివేశారు. చంద్రబాబు అరెస్టు నేపథ్యంలో ముందస్తు జాగ్రత్తగా బస్సులను నిలిపివేశామని ప్రజా రవాణాశాఖాధికారులు పేర్కొంటున్నారు. శనివారం ఉదయం నుంచి మధ్యాహ్నం 11 గంటల వరకూ మద్దిలపాలెం నుంచి ఒక్క బస్సు కూడా కదలేదు. తర్వాత నుంచి నగరంలో పలు ప్రాంతాలకు కొన్ని సర్వీసులు నడిపారు. కాగా సిటీ బస్సులను సుమారు 40 బస్సులు రద్దు చేశారు. దీంతో సుమారు రూ.3 లక్షల నష్టం వాటిల్లిందని అధికారులు పేర్కొంటున్నారు. కాగా సుదీర ప్రాంతాలైన కాకినాడ, రాజమండ్రి, శ్రీకాకుళంకు నడిపే ఏసీ బస్సులు 10 సర్వీసులను పూర్తి రద్దు చేశారు. దీంతో మరో రూ.2 లక్షల వరకూ నష్టం ఏర్పడిందని అధికారులు అంచనా వేస్తున్నారు.

అప్పన్నకు వైభవంగా ఆర్జిత సేవలు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి శనివారం ఆర్జిత సేవలు వైభవంగా జరిగాయి. ఆలయ బేడామండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్టంపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం,మాంగల్యధారణ,తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం నిర్వహించారు.

ఘనంగా గరుడసేవ

శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి శనివారం గరుడసేవ ఘనంగా జరిగింది.బేడామండపంలోని వెండి గరుడవాహనంపై స్వామివారి ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని అధిష్టంపజూసి అష్టోత్తరశతనామావళి పూజ నిర్వహించారు. భక్తులను గరుడవాహనం చుట్టూ ప్రదక్షిణ చేయించారు.